
సాక్షి
కర్నూలు
శుక్రవారం । 1 । సెప్టెంబర్ । 2023



నీటిమట్టం 852 అడుగులు
శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నీటిమట్టం గురువారం సాయంత్రానికి 852.50 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం జలాశయంలో 85.7503 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



తక్కువ ఎత్తుతో చిక్కు
తగినంత ఎత్తు లేక ఎస్‌ఐ మహిళా అభ్యర్థుల్లో కొందరు అనర్హులుగా వెనుదిరుగుతున్నారు. రెండు రోజులుగా మహిళా అభ్యర్థులకు శారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. 8లో▸



సీఎండీఎఫ్.. వినియోగంలో టాప్
చీఫ్ మినిస్టర్ డెవలప్‌మెంట్ ఫండ్(సీఎండీఎఫ్) వినియోగంలో రాష్ట్రంలో కర్నూలు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. నంద్యాల రెండో స్థానాన్ని నిలబెట్టుకుంది. 8లో▸

న్యూస్‌రీల్

నేడు కౌలుదారులకు పెట్టుబడి సాయం

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్‌ఆర్ రైతుభరోసా కింద సీసీఆర్‌సీ కార్డులు పొందిన కౌలుదారులకు వైఎస్‌ఆర్ రైతుభరోసా కింద పెట్టుబడి సాయం విడుదల కార్యక్రమం శుక్రవారానికి వాయిదా పడింది. గురువారమే కౌలుదారుల బ్యాంకు ఖాతాలకు పెట్టుబడి సాయంగా రూ.7,500 ప్రకారం నగదు విడుదల కావాల్సి ఉంది. చివరి నిమిషంలో వాయిదా పడిందని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎలాంటి సొంత భూమిలేని 16,486 మందికి నేడు ప్రభుత్వం డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) ద్వారా నగదు బదిలీ చేస్తున్న విషయం తెలిసిందే. సాగుదారులకు పెట్టుబడి సాయం రూ.13,500 పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుంది. మొదటి విడతలో రూ.7,500 ప్రకారం ఉమ్మడి జిల్లాలో రూ.12,36,45,000 సాగుదారులకు బ్యాంకు ఖాతాలకు విడుదల చేస్తుండటం విశేషం.

ప్రత్యామ్నాయ పంటల సాగు ఉత్తమం

కర్నూలు(అగ్రికల్చర్): వర్షాలు ఆలస్యమవుతున్నందున ఇంతవరకు విత్తనం పడని నేలల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. వర్షాధారం కింద సెప్టెంబర్ నెలలో ఎర్ర నేలలు, నల్ల రేగడి నేలల్లో వేసుకోదగిన పంటల వివరాలను గురువారం ఒక ప్రకటనలో వివరించారు. వర్షాలు రావడం ఆలస్యమైన పక్షంలో రైతులు ఆయా ప్రాంతాల్లో మామూలుగా పండించే పంటలకు బదులు, తక్కువ రోజుల్లో కోతకు వచ్చే పంటలు, బెట్ట పరిస్థితులను తట్టుకోగలిగే పంటలు, తక్కువ ఖర్చుతో పండించే పంటలను ప్రత్యామ్నాయంగా ఎంచుకోవాలన్నారు. సెప్టెంబర్ నెలలో ఎర్ర నేలల్లో జొన్న, గోరు చిక్కుడు, సజ్జ, పెసర, ఆలసంద, ఉలవ, అనుములు పంటలు వేసుకోవచ్చన్నారు. నల్లరేగడి నేలల్లో జొన్న, గోరుచిక్కుడు, పెసర, అలసంద, పొద్దుతిరుగుడు, కొర్ర, అనుములు వంటి పంటలు సాగు చేసుకోవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి పేర్కొన్నారు.

మహిళా కూలీకి వజ్రం లభ్యం

తుగ్గలి: మహిళా కూలీకి వజ్రం రూపంలో అదృష్టం తలుపుతట్టింది. గురువారం జొన్నగిరి సమీపంలోని పొలంలో కలుపు తీస్తుండగా వజ్రం దొరికింది. దీనిని రూ.40వేలు నగదు, తులం బంగారం ఇచ్చి ఓ వ్యాపారి కొనుగోలు చేసినట్లు తెలిసింది.

2న సర్టిఫికెట్ల పరిశీలన

కర్నూలు(అర్బన్): రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టుల మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 2న ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందని జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. 54 పోస్టులకు సంబంధించి మెరిట్, రిజర్వేషన్ నిబంధనల మేరకు 1:2 రేషియో ప్రకారం 108 మంది అభ్యర్థుల తాత్కాలిక జాబితాను http://kurnool.ap.nic.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ ధృవపత్రాలతో పాటు గెజిటెడ్ అధికారి సంతకంతో కూడిన రెండు సెట్ల సర్టిఫికెట్లతో పరిశీలనకు హాజరుకావాలన్నారు.

సింహ వాహనంపై విశ్వమోహనుడు



విశేష అలంకరణలో రాఘవేంద్రుల మూల బృందావనం



శ్రీమఠం ప్రాంగణంలో సింహవాహనంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

- ఘనంగా పూర్వారాధన వేడుకలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- అనుగ్రహ ప్రశస్థి అవార్డుల ప్రదానం



కర్ణాటక డోలు కళాకారుల ప్రదర్శన

మంత్రాలయం: మంగళ వాయిద్యాల సుస్వర నాదాలు.. పండితుల మంత్రోచ్చారణలు.. భక్తజన కోలాహలం మధ్య సింహవాహనంపై విశ్వమోహనుడు ప్రహ్లాదరాయలు శ్రీమఠం ప్రాంగణ వీధుల్లో ఊరేగారు. శ్రీ రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం పూర్వారాధన వేడుకలు నిర్వహించారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు నేతృత్వంలో సుప్రభాత సేవ, మూల బృందావన నిర్మల్యావిసర్జన, పుష్పార్చన, విశేష పంచామృతాభిషేకం, విశిష్ట పుష్పాలంకరణతో పూజలు చేశారు. రాత్రి ఊంజల సేవలు నిర్వహించారు. ప్రహ్లాదరాయలును సింహవాహనంపై కొలువుంచి ఊరేగించారు. వేలాది భక్తజనం సందోహం మధ్య శ్రీమఠం ప్రాకార వీధుల్లో నయన మనోహరంగా ఊరేగింపు సాగింది.





శ్రీమఠంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, ఆర్థిక మంత్రి బుగ్గన, ఎంపీ పోచా తదితరులు, అవార్డు స్వీకరిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

పట్టువస్త్రాల సమర్పణ

పూర్వారాధనను పురస్కరించుకుని అహోబిలం లక్ష్మీనరసింహస్వామి, తమిళనాడులోని శ్రీరంగం రంగనాథ స్వామి, కర్ణాటకలోని ములబాగల్ శ్రీపాదతీర్థ క్షేత్రాల నుంచి పట్టువస్త్రాలు సమర్పించారు. శ్రీమఠం ముఖ ద్వారం నుంచి ఊరేగింపుగా వెళ్లగా శ్రీమఠం పీఠాధిపతి గౌరవప్రదంగా వస్త్రాలను స్వీకరించారు. రాఘవేంద్రస్వామి మూలబృందావనం ముంగిట ఉంచి విశేష పూజలు చేపట్టారు. పూజామందిరంలో పీఠాధిపతి రాయరు, మూల, జయ, దిగ్విజయ, రాములకు సంస్థాన పూజ చేశారు. వేడుకల్లో బందోబస్తును ఎస్పీ కృష్ణకాంత్ పర్యవేక్షించారు.

> **శ్రీమఠం.. సర్వజన శాంతి పీఠం**
>
> సర్వజన శాంతి పీఠంగా మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం వర్ధిల్లుతోందని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. శ్రీమఠం అనుగ్రహ ప్రశస్థి అవార్డు కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ.. ద్వైత సిద్ధాంతాన్ని మధ్వాచారులు ప్రవేశపెట్టారన్నారు. రాఘవేంద్రస్వామిని ప్రహ్లాదరాయల అవతారంగా భావిస్తారన్నారు. రాఘవేంద్రస్వామి తమిళనాడులోని కుంభకోణంలో జన్మించారని తెలిపారు. మధ్వ మతగురు పరంపర వ్యాసరాయలతో సన్యాసం స్వీకరించారన్నారు. తుంగభద్ర నదీతీరంలో రాఘవేంద్రులు జీవసమాధి అయ్యారని, మధ్వమత ప్రచారంలో రాఘవేంద్రుల కృషి చిరస్మరణీయమన్నారు. ప్రస్తుత పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో శ్రీమఠం అభివృద్ధి చెందడం హర్షణీయమన్నారు. గ్రామస్తుల కోసం వ్యాసతీర్థ వాటర్ స్కీం, భక్తులకు అన్నదాన వితరణ, గో సంరక్షణ, ఉచిత వైద్యం వంటి సంక్షేమ కార్యక్రమాలపై సంతోషం వ్యక్తం చేశారు. శ్రీమఠం ప్రగతి ఎంతగానో ఆకట్టుకుంటోందన్నారు. అనంతరం అనుగ్రహ ప్రశస్థి అవార్డులు అందుకున్న ప్రముఖులను అభినందించారు.

జగనన్నను మరోసారి సీఎం చేసుకుందాం

- ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టండి
- ఎన్నికల సంవత్సరంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలి
- వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య



వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య

కర్నూలు(సెంట్రల్): వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ, అనుబంధ సంఘాలు సమన్వయంతో పనిచేసి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేసుకుందామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య పిలుపునిచ్చారు. పార్టీలో ఎవరూ ఎక్కువ కాదు, తక్కువ కాదు.. అందరూ కార్యకర్తలనే విషయాన్ని గుర్తుంచుకుని పనిచేయాలన్నారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, జోనల్ ఇన్‌చార్జ్‌లతో గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీవై రామయ్య మాట్లాడుతూ.. ఎన్నికల సంవత్సరం కావడంతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. త్వరలోనే ఎమ్మెల్యేలు, సమన్వయకర్తల ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గంలో అనుబంధ సంఘాల సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. ఆయా సమావేశాలకు తనతోపాటు ముఖ్యమైన నాయకులు హాజరయ్యేలా చూడాలన్నారు. అనుబంధ సంఘాలకు సంబంధించి గ్రామ, మండల, జిల్లాస్థాయి కమిటీలను నియమించుకోవాలన్నారు. ఆయా సమావేశాలకు గ్రామ స్థాయి నుంచి ఎక్కువ మంది హాజరయ్యేలా చూడాలన్నారు. ప్రస్తుతం ఓటరు జాబితా సవరణ కార్యక్రమం జరుగుతుండడంతో జాగ్రత్త వహించాలన్నారు. ప్రతి కార్యకర్త ఓటును పరిశీలించి జాబితాలో ఉందో లేదో చూసుకోవాలన్నారు. దొంగ ఓట్లు, మరణించిన వారి పేర్లను తొలగించే విషయంలో పోలింగ్ బూతులో ఉండే ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేసే విమర్శలను ఎక్కడికక్కడే తిప్పి కొట్టాలన్నారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిపై కొండారెడ్డి బురుజు దగ్గర చర్చ నిర్వహిస్తామని, త్వరలోనే తేదీలు, సమయాలు చెబుతామన్నారు. టీడీపీ, జనసేన, ఇతర పార్టీలు బహిరంగ చర్చకు రావాలన్నారు.

> **చంద్రబాబుకు మతిభ్రమించింది**
>
> టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు మతిభ్రమించిందని బీవై రామయ్య ధ్వజమెత్తారు. టీడీపీ గేట్లు తెరిస్తే వైఎస్సార్‌సీపీ ఖాళీ అవుతుందని చెప్పడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలుచుకుంటే టీడీపీ ఖాళీ అవ్వడం ఖాయమన్నారు. అటువంటి నీచ రాజకీయాలు వైఎస్సార్‌సీపీ చేయబోదన్నారు. 2024 ఎన్నికల తరువాత టీడీపీ శాశ్వతంగా మూతపడడం ఖాయమని, ఆపార్టీ నాయకులు తట్టాబుట్టా సర్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్‌లు గాజుల శ్వేతారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులుజులేఖాబీ, విజయ యాదవ్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కేదార్‌నాథ్, ప్రచార విభాగం అధ్యక్షుడు ఎల్.వెంకటేశ్వర్లు, విద్యా విభాగం జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, యూత్ వింగ్ అధ్యక్షుడు ఇర్ఫాన్ పాల్గొన్నారు.

పట్టాలపై ‘డబ్లింగ్’ ప్రగతి

- మహబూబ్‌నగర్ నుంచి కర్నూలు మీదుగా డోన్ వరకు రైల్వే డబుల్ లైన్
- ముడ్‌ఖేడ్ – డోన్ డబ్లింగ్ ప్రాజెక్టు పనుల పూర్తికి చర్యలు
- 417.88 కిలో మీటర్ల ఈ లైను అంచనా వ్యయం రూ.4,680.09 కోట్లు
- ఈ మార్గం పూర్తయితే తగ్గనున్న ప్రయాణ సమయం.. పెరగనున్న రైళ్లు



డోన్-ముద్ఖేడ్ మధ్య హైదరాబాదు సమీపంలో జరిగిన డబుల్ లైన్ పనులు

కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ముడ్‌ఖేడ్ – డోన్ స్టేషన్ల మధ్య డబ్లింగ్ పనులకు గ్రీన్ సిగ్నల్ లభించింది. ఇప్పటికే మంజూరు అయిన ప్రాజెక్టు పనులు కాచిగూడ (హైదరాబాదు) నుంచి మహబూబ్ నగర్ స్టేషన్ల మధ్య పూర్తయ్యాయి. మిగిలిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. రూ.4,686.09కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన 417.88 కిలో మీటర్ల ఈ డబుల్ లైన్ పనులను రైల్వే మంత్రిత్వ శాఖ ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. దీంతో పెండింగ్‌లో ఉన్న మహబూబ్ నగర్ నుంచి కర్నూలు మీదుగా నంద్యాల జిల్లా డోన్ వరకు పనులు చేపట్టేందుకు మార్గం ఏర్పడింది. ఈ పనులు పూర్తయితే ప్రయాణ సమయం తగ్గడంతో పాటు రైళ్ల రాకపోకల సంఖ్య పెరగనుంది. దీంతో పాటు గూడ్స్ రైళ్లు పెరిగి సరుకు రవాణా, ఎగుమతి సులభం కానుంది. ఇప్పటికే అమృత్ భారత్ స్టేషన్ల జాబితాలో కర్నూలుకు చోటు దక్కింది. డబుల్ లైన్ పనులుకు గ్రీన్ సిగ్నల్ లభించడం శుభపరిణామంగా చెప్పవచ్చు.

డబుల్ లైన్ ప్రాజెక్టు లక్ష్యాలు ఇవే..

డబుల్ లైన్ మార్గం పొడవు 417.88 కిలో మీటర్లు ఉండగా రూ.4,686.09 కోట్లు కేటాయించనున్నారు. ఈ లైను మార్గంలో ఆరు జంక్షన్ స్టేషన్లు, 39 క్రాసింగ్ స్టేషన్ల, 20 హాల్ట్ స్టేషన్లు ఉన్నాయి. ముఖ్యమైన వంతెనలు ఆరు, ప్రధాన వంతెనలు 34, చిన్న వంతెనలు 653, లెవెల్ క్రాసింగ్ 117, ఆర్‌యూబీ (విస్తరణ) 32 ఉన్నాయి. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 73.91 కిలో మీటర్లు అనుమతించగా రైళ్ల వేగం గంటకు 130 కిలో మీటర్ల వరకు పెరిగే అవకాశం ఉంది.

ప్రయోజనాలు ఇవీ..

- రైళ్లు ఒకే ట్రాక్‌పై ఎదురెదురుగా వస్తున్నప్పుడు జరిగే ప్రమాదాలను నివారించవచ్చు.
- కొత్త రైళ్లు ప్రవేశపెట్టడానికి మార్గం లభిస్తుంది.
- రైళ్ల సగటు వేగాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.
- పారిశ్రామిక, వ్యవసాయ రంగాలు పురోగతిలోకి వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

రైల్వే క్రాసింగ్‌కు చెక్

ఇప్పటి వరకు ఉన్న సింగిల్ లైన్ కారణంగా రైళ్ల రాకపోకల సమయాల్లో క్రాసింగ్ కోసం నిలిపివేయాల్సిన పరిస్థితి ఉండేది. ఏదైనా స్టేషన్‌లో ఒక రైలును నిలిపివేసి, మరో రైలును పంపించాక సిగ్నల్ ఇచ్చే వారు. ఒక్కోసారి క్రాసింగ్ కోసం 30 నుంచి 40 నిమిషాల వరకు రైలును నిలిపే వారు. దీంతో నిలిచి ఉన్న రైళ్లలోని ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. డబుల్ లైను పనులు పూర్తయితే ఏ రూటులో వెళ్లే రైళ్లు ఆ రూటులో వెళ్తాయి. దీంతో క్రాసింగ్ సమస్యకు పరిష్కారం లభించనుంది.

సులువుగా సరుకు రవాణా

ముద్ఖేడ్ – డోన్ విభాగం దేశంలోని ఉత్తర, పశ్చిమ భాగాన్ని దక్షిణ ప్రాంతంతో కలుపుతుంది. ఈ మార్గంలో కొన్నేళ్లుగా సరుకు రవాణా, ప్రయాణికుల రద్దీ క్రమంగా పెరుగుతూ వస్తోంది. ఈ మార్గాన్ని డబ్లింగ్ చేయడంతో రద్దీ తగ్గడంతో పాటు దిగువన ఉన్న ప్రధాన పారిశ్రామిక సమూహాలు, 17 ఎకనామికల్ కారిడార్లు సేవలను మెరుగుపడుతాయి. వైఎస్‌ఆర్ కడప జిల్లా ముద్దనూరు వద్ద ఉన్న ఏపీ జెన్‌కో థర్మల్ పవర్ ప్లాంట్‌తో పాటు కర్నూలు నుంచి ఆహార ధాన్యాల ఎగుమతి, కర్నూలు ఇండస్ట్రియల్ క్లస్టర్ అభివృద్ధిలోకి రానున్నాయి.

> **డబ్లింగ్‌తో అన్ని రంగాలు అభివృద్ధి**
>
> 
>
> డోన్ – ముద్ఖేడ్ మధ్య రైల్వే డబుల్ లైనుకు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదించింది. ఈ పనులు చేపడితే అనేక రంగాలు అభివృద్ధి చెందుతాయి. ముఖ్యంగా ప్రయాణికుల ప్రయాణ సమయం తగ్గుతుంది. క్రాసింగ్ సమస్య ఉండదు. సరుకు రవాణా, వ్యవసాయం, పారిశ్రామిక రంగాలు పురోగతిలోకి వస్తాయి. ఒకే ట్రాక్‌పై రైళ్లు ఎదురెదురుగా వస్తున్నప్పుడు కలిగే ఇబ్బందులు ఉండవు.
>
> –లోకేష్ విష్ణోయ్, దక్షిణ మధ్య రైల్వే డీఆర్‌ఎం

క్లుప్తంగా

సెప్టెంబర్ 15,16 తేదీల్లో అగ్నివీర్ పోస్టులకు ఎంపిక

కర్నూలు(హాస్పిటల్): భారత వాయుసేనలో అగ్నివీర్–వాయు సంగీత కారుడు పోస్టులకు ఎంపిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి పీవీ రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 15,16వ తేదీల్లో హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ఈ ఎంపిక కార్యక్రమం నిర్వహిస్తారని పేర్కొన్నారు. అభ్యర్థుల వయస్సు 17 సంవత్సరాల 6 నెలల నుంచి 21 సంవత్సరాలలోపు ఉండాలని, విద్యార్హత 10వ తరగతి, సంగీతంలో పరిజ్ఞానం కలిగి ఉండి పూర్తి పాటను పాడగలగాలన్నారు. అలాగే భారతీయ వాయిద్య పరికరాలు, కన్సర్ట్ ఫ్లూట్, స్ట్రింగ్ బేస్ మొదలైన వాయిద్య పరికరాల్లో ఏదైనా ఒకదానిలో లేదా రెండింటిలో ప్రావీణ్యం ఉండాలని తెలిపారు. మ్యూజికల్ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్‌లు కలిగి ఉండాలన్నారు. పూర్తి వివరాలకు భారత వాయుసేన వారి వెబ్ పోర్టల్ https://agnipathvayu.cdac.in ను సందర్శించాలన్నారు.

డిగ్రీ 6వ సెమిస్టర్ ఫలితాల విడుదల

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ 6వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ (జూలై– ఆగస్టు 2023) పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 12,103 మంది హాజరుకాగా 9,541 మంది, సప్లిమెంటరీకి 4,350 మంది హాజరుకాగా 2,230 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఫలితాల కోసం https://rayalaseemauniversity.ac.inలో చూడాలన్నారు.

ఇంటర్ ఫెయిల్ విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలి

నంద్యాల(న్యూటౌన్): గత విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియెట్ తప్పిన, మధ్యలో చదువు మానేసిన ఆర్ట్స్ గ్రూపు విద్యార్థులు మరోసారి పరీక్షలు రాసేందుకు బోర్డు అవకాశం కల్పించిందని విద్యార్థులు ఫీజు రుసుం చెల్లించాలని డీవీఈఓ సునీత గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023–24 విద్యాసంవత్సరంలో వచ్చే మార్చిలో జరిగే పరీక్షలకు సెప్టెంబర్ 30వ తేదీలోగా కళాశాలలో ఫీజు చెల్లించాలన్నారు. మొదటి, రెండవ సంవత్సరం ఫెయిల్ అయిన విద్యార్థులు రూ.550 చెల్లించాలన్నారు. విద్యార్థులు వారు చదివిన కళాశాలలో ఫీజు చెల్లించాలన్నారు.



బేతంచెర్లలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి



కల్లూరులో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికి రాఖీ కడుతున్న ఎంపీపీ ఉసేన్‌బీ



చాగలమర్రిలో విద్యార్థులకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు



నంద్యాల ఆయుష్ యోగా కేంద్రంలో రాఖీలు కట్టి హారతులు ఇస్తున్న మహిళలు



ఆలూరులో మంత్రి గుమ్మనూరుకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి

ఆత్మీయ బంధం.. అనురాగ సంబరం

జిల్లాలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొందరు మహిళలు అన్నలకు, తమ్ముళ్లకు రాఖీలు కట్టి ఆత్మీయ బంధాన్ని చాటుకున్నారు. మరికొందరు మహిళలు సోదరులకు తిలకం దిద్ది, రాఖీని కట్టి, హారతులు ఇచ్చి సంబరాలు చేసుకున్నారు. 'నీవు నాకు రక్ష.. నేను నీకు రక్ష..మన ఇద్దరం ధర్మాన్ని, దేశాన్ని రక్షిద్దాం' అని ప్రతిజ్ఞ పూనారు. రాఖీలు కట్టిన అక్కలకు, చెల్లెమ్మలకు సోదరులు బహుమతులు అందజేశారు. రక్షాబంధన్ వేడుక సందర్భంగా ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద సందడి కనిపించింది. మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, గుమ్మనూరు జయరాంకు బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు చెప్పారు. –సాక్షినెట్‌వర్క్



పత్తికొండలో సీఎం వైఎస్‌జగన్ కటౌట్‌కు రాఖీలు కడుతున్న మహిళలు



డీసీసీబీ సీఈవో రామాంజనేయులుకు రాఖీ కడుతున్న చైర్‌పర్సన్ విజయమనోహరి



కర్నూలులో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌కు రాఖీ కడుతున్న మహిళ



కర్నూలులో పున్నమి చంద్రుడి వెలుగులు..



– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

'సీఎండీఎఫ్' వినియోగంలో టాప్

- ఇప్పటి వరకు 144 పనుల పూర్తి.. రూ. 1.33 కోట్ల చెల్లింపులు
- వివిధ దశల్లో మరో 188 పనులు

కర్నూలు(సెంట్రల్): చీఫ్ మినిస్టర్ డెవలప్‌మెంట్ ఫండ్(సీఎండీఎఫ్) వినియోగంలో రాష్ట్రంలో కర్నూలు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. రెండో స్థానాన్ని నంద్యాల, మూడో స్థానాన్ని శ్రీకాకుళం జిల్లా దక్కించుకున్నాయి. చీఫ్ మినిస్టర్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద 2019–20 ఆర్థిక సంవత్సరంలో ప్రతి ఎమ్మెల్యేకు నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం ఏడాదికి రూ.2కోట్లను కేటాయించారు. అయితే కరోనా మహమ్మారి విజృంభణతో నిధుల కేటాయింపు మధ్యలోనే నిలిచిపోయింది. తరువాత రెండేళ్లపాటు ఎలాంటి నిధులు రాలేదు. 2022–23 ఆర్థిక సంవత్సరం నిధులు రాగా వాటి వినియోగం కోసం కర్నూలు జిల్లాలో 332 పనులను గుర్తించి రూ. 13.25 కోట్లను కేటాయించారు. ఇందులో ఇప్పటి వరకు 144 పనులు పూర్తి కాగా, మరో 188 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. నిధుల్లో ఇప్పటి వరకు రూ. 1.33 కోట్లను కేటాయించగా మరో రూ. 1.7 కోట్ల బిల్లులకు సంబంధించి చెల్లింపులు చేయాల్సి ఉంది.

పక్కా ప్రణాళికతో ముందుకు...

ఎమ్మెల్యేలకు కేటాయించే రూ. 2 కోట్ల నిధుల వినియోగానికి సరైన ప్రణాళికతో జిల్లా యంత్రాంగం ముందుకెళ్తోంది. ఆయా నియోజకవర్గాల్లో చేపట్టబోయే పనులపై చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్(సీపీఓ) నేతృత్వంలోని బృందం పక్కా ప్రణాళిక రూపొందించింది. ముఖ్యంగా తాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు నిధులను ఎక్కువగా వినియోగించారు. తర్వాత మురుగు కాలువలు, సీసీరోడ్లు, ఇతర ప్రాధాన్యత పనులకు ప్రాధాన్యం ఇచ్చారు. పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ఎల్.అప్పలకొండ తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులకు మల్టీటాస్క్ విధులు



హాజరైన పంచాయతీ కార్యదర్శులు



మాట్లాడుతున్న డైరెక్టర్ మురళి

- ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ మురళి

కర్నూలు(అర్బన్): పంచాయతీ కార్యదర్శులు తాము రెగ్యులర్‌గా నిర్వహిస్తున్న విధులతో పాటు మల్టీ టాస్క్ విధులు కూడా నిర్వహించాల్సి ఉందని ఏపీఎస్ ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్, రిటైర్డు ఐఏఎస్ అధికారి జే మురళి అన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు ఆగస్టు 29వ తేది నుంచి ప్రారంభమైన రెసిడెన్షియల్ శిక్షణను పరిశీలించేందుకు ఆయన గురువారం ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 12,500 మంది పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహిస్తుండగా, ఇందులో 6,500 మంది గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులు ఉన్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో 26 కేంద్రాల్లో ఈ శిక్షణను కొనసాగిస్తున్నట్లు చెప్పారు. గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులు ఉద్యోగాలు పొందినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి శిక్షణను పొందలేదన్నారు. వీరు డీడీఓలుగా కొనసాగేందుకు, పంచాయతీరాజ్ చట్టం 1994 గురించి అవగాహన పెంచుకునేందుకు ఈ శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్, జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, నంద్యాల డీపీఓ మంజులవాణి, కర్నూలు శిక్షణ పర్యవేక్షకులు వెంకటరత్నం, మేనేజర్ గిడ్డేష్, రాజవర్ధన్, మాస్టర్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన శ్రీనివాసులు

డోన్ టౌన్: యాపదిన్నె – ఎద్దుపెంట రహదారిలో ఆటో బోల్తా పడిన ప్రమాదంలో చనుగొండ్ల గ్రామానికి చెందిన శ్రీనివాసులు (26) మృతి చెందాడు. రూరల్ పోలీసు స్టేషన్ ఎస్ఐ సుధాకర్ రెడ్డి గురువారం తెలిపిన వివరాల మేరకు.. చనుగొండ్ల గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మద్దిలేటి బుధవారం రాత్రి డోన్ నుంచి స్వగ్రామానికి ప్రయాణికులతో వెళ్తుండగా యాపదిన్నె రోడ్డు నుంచి ఎద్దుపెంట రోడ్డుకు తిరిగే క్రాస్‌లో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చనుగొండ్ల గ్రామానికి చెందిన శ్రీనివాసులు, మధు, కాశీ విశ్వనాథ్, నగేష్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాసులు కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య మాదేవి, తల్లిదండ్రులు, ఉన్నారు. మృతుడి తండ్రి నరసింహుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అంతర్ డిగ్రీ కళాశాలల స్పోర్ట్స్ క్యాలెండర్ ఆవిష్కరణ



తీర్మానాలను వెల్లడిస్తున్న వీసీ ఆనందరావు

కర్నూలు(టౌన్): సెప్టెంబర్ నెల మూడో వారం నుంచి రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో అంతర్ డిగ్రీ కళాశాలల క్రీడా పోటీలు ప్రారంభమవుతాయని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆనందరావు వెల్లడించారు. గురువారం స్థానిక రాయలసీమ యూనివర్సిటీలో స్పోర్ట్సు అడ్వైజరీ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీలను ఖరారు చేశారు. అనంతరం వైస్ చాన్సలర్ మాట్లాడుతూ నంద్యాలలోని డిగ్రీ కళాశాలలో బ్యాడ్మింటన్ స్త్రీ, పురుషుల పోటీలు.. కర్నూలు సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాలలో బాలికల పోటీలు ఉంటాయన్నారు. ఐఎఎస్సీ కళాశాలలో (సిల్వర్ జూబ్లీ కళాశాల) పురుషుల హ్యాండ్‌బాల్, టేబుల్ టెన్నిస్, బాల్ బాడ్మింటన్, చెస్ పోటీలను నిర్వహిస్తామన్నారు. రాయలసీమ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంటు ఆధ్వర్యంలో అథ్లెటిక్స్ పోటీలు ఏర్పాటవుతాయన్నారు. సమావేశంలో స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ శివకిషోర్, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాసులు, వివిధ కళాశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తక్కువ ఎత్తుతో చిక్కు

- ఎస్ఐ ఉద్యోగాలకు అనర్హులుగా తేలుతున్న మహిళా అభ్యర్థులు





మహిళా ఎస్ఐ అభ్యర్థులకు సూచనలిస్తున్న డీఐజీ, ఎస్పీ, అభ్యర్థుల సర్టిఫికెట్లను స్కాన్ చేస్తున్న పోలీసు సిబ్బంది

కర్నూలు: పోలీసు శాఖలో ఎస్ఐ ఉద్యోగాలకు ఆసక్తి చూపిన మహిళా అభ్యర్థుల్లో కొందరు తగినంత ఎత్తు లేక అనర్హులుగా వెనుదిరుగుతున్నారు. రెండు రోజులుగా మహిళా అభ్యర్థులకు కర్నూలు ఏపీఎస్పీ రెండో పటాలం మైదానంలో శారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. గురువారం 700 మంది మహిళా అభ్యర్థుల్లో 459 మంది హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తర్వాత బయోమెట్రిక్, ఎత్తు, బరువు వంటి ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం వీరందరికీ శారీరక సామర్థ్య పరీక్షలు (ఫిజికల్ ఎఫీషియన్సీ టెస్టు) 1600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు చేపట్టారు. ఇందులో 248 మంది మాత్రమే తుది రాత (మెయిన్స్) పరీక్షకు అర్హత సాధించారు.

పీఎంటీ అర్హత కోసం..

పోలీసు ఉద్యోగాలకు మహిళా అభ్యర్థులు కనీసం 152.5 సెంటీమీటర్ల ఎత్తు ఉండాలి. అయితే శారీరక సామర్థ్య పరీక్షలకు హాజరైన వారిలో 24 మంది అభ్యర్థులు ఎత్తు తక్కువగా ఉండి, 1600 మీటర్ల పరుగులో 116 మంది, 100 మీటర్ల పరుగులో 246 మంది, లాంగ్‌జంప్‌లో 113 మంది విఫలమై తుది పరీక్షకు అర్హత సాధించలేకపోయారు. కొంతమంది ఎత్తు లేకపోయినప్పటికీ ఎస్ఐ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

గజిటెడ్ సంతకంతో మూడు సెట్లు జిరాక్స్ కాపీలు తేవాలి

ఎస్ఐ ఉద్యోగాల శారీరక సామర్థ్య పరీక్షలకు హాజరయ్యే ప్రతి అభ్యర్థి ఒరిజినల్ మార్కు లిస్టుతో పాటు గజిటెడ్ సంతకంతో కూడిన మూడు సెట్లు జిరాక్స్ కాపీలు తీసుకురావాలని ఎస్పీ కృష్ణకాంత్ సూచించారు. ఒరిజినల్ మార్కులిస్టులకు ల్యామినేషన్ ఉంటే తొలగించి తీసుకురావాలని, దీనివల్ల స్కాన్ చేయడానికి వీలుగా ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు. – ఎస్పీ కృష్ణకాంత్

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

- రూ.3.86 లక్షల విలువైన సొత్తు స్వాధీనం



చోరీ సొత్తు, నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: కొంత కాలంగా జిల్లాలోని ఆలయాలతో పాటు ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను జిల్లా పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి నిందితుల వివరాలను వెల్లడించారు. గత నెల ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలోని శిరివెళ్ల మండల కేంద్రంలోని ఓ ఇంట్లో జరిగింది. అదే మండలం వెంకటాపురం, మహదేవాపురం గ్రామంలోని ఆలయాల్లో చోరీ జరిగింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఆళ్లగడ్డ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న అనంతపురం జిల్లా పామిడి మండలం ఖాదరపేట గ్రామానికి చెందిన నల్లబోతుల నాగప్ప, అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం భరత్‌నగర్‌కు చెందిన చప్పిడి మణిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. వీరు దాదాపుగా 65 చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్నారు. ఒక కేసులో జైలు శిక్ష అనుభవిస్తూ కడప సెంట్రల్ జైలులో ఇద్దరికి పరిచయం ఏర్పడింది. ఇద్దరు కలిసి గత నెల శిరివెళ్ల మండల కేంద్రంలోని ఓ ఇంట్లో 4 తులాల బంగారు చైను, 4 తులాల బంగారు గాజులు దొంగిలించారు. అదే మండలం వెంకటాపురం గ్రామంలోని శివాలయంలో 4 ఇత్తడి గంటలు, వెండి నాగపడగ, 6 ఇత్తడి పాత్రలు, 4 ఇత్తడి అండాలు, అమ్మవారి వెండి చేతి తొడుగులు, ఆరు దీపాల కలశాలు, చెవి పోగులు, రాగి బిందెను దొంగిలించారు. అదే మండలం మహదేవాపురం గ్రామంలోని సర్వనరసింహస్వామి దేవాలయంలోని హుండీలో రూ. 32 వేలు దొంగిలించారు. నంద్యాల తాలూకా పరిధిలోని పులిమద్దిలోని దేవాలయంలో అమ్మవారి బంగారు బొట్టుబిళ్ల, ముక్కుపుడకలు, వెండికిరీటం అపహరించారు. ఇద్దరి నిందితుల నుంచి మొత్తం ఆభరణాలను పోలీసులు రికవరీ చేశారు. వీటి విలువ సుమారు రూ. 3.86 లక్షలు ఉంటుందని ఎస్పీ వివరించారు. కేసును చాకచక్యంగా ఛేదించిన డీఎస్పీ వెంకట్రామయ్య, సీఐ చంద్రబాబునాయుడు, ఎస్ఐ సురేష్, హెడ్‌కానిస్టేబుల్ కృష్ణయ్య, నాగేంద్రుడు, సిబ్బంది కిరణ్‌కుమార్, శ్రీనివాసులు, నీలకంఠంలను ఎస్పీ, అడిషనల్ ఎస్పీ వెంటరాముడు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ ఇంజినీర్ మృతి



నరేష్ (ఫైల్)

మద్దికెర: ఆర్మీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్న మద్దికెర గ్రామానికి చెందిన నరేష్ (31) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఆర్మీలో నరేష్ ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మద్దికెరలో తన మేనమామ కుమారుడు వివాహానికి హాజరయ్యేందుకు పంజాబ్ నుంచి హైదరాబాద్ వచ్చారు. అక్కడి నుంచి బుధవారం మోటర్‌బైక్‌లో మద్దికెరకు వస్తుండగా హైదరాబాద్ సమీపంలోని చింతాలంపల్లి వద్ద వేరొక బైక్ ఢీకొనడంతో నరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య ఉమ, కుమార్తె ఉన్నారు. గురువారం మద్దికెరలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి



వీరేష్ (ఫైల్)

ఆదోనిఅర్బన్: పట్టణ శివారులోని సిద్ధరుడమఠం సమీపంలో ఆటో ఢీకొనడంతో జాలిమంచి గ్రామానికి చెందిన శెట్టిబలిజ వీరేష్(30) అక్కడికక్కడే మృతిచెందాడు. సెంట్రింగ్ పని నిమిత్తం ఆదోనికి వెళ్తుండగా యల్లమ్మకొండ దగ్గర ఆటో ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మృతునికి భార్య రంగమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య రంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.